సమస్యలతో సహవాసం..

- ఎక్కడి చెత్త అక్కడే
- వెలగని వీధి దీపాలు
- తాగునీటికి తిప్పలు



అసంపూర్తిగా మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం

సుజాతనగర్: సింగభూపాలెం గ్రామ పంచాయతీలో 5, 9 వార్డుల్లో ప్రజలు సమస్యలతో సహవాసం చేస్తున్నారు. ఈ రెండు వార్డుల్లో సుమారు 150 కుటుంబాలు నివాసం ఉంటుండగా.. గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. చిన్నవర్షం కురిసినా వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి.

నెల రోజులుగా అంధకారం...

గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో నెల రోజులుగా వీధిలైట్లు వెలగక రాత్రిపూట చిమ్మ చీకటి. కాలిపోయిన వీధి దీపాలను ఎవరూ పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో ఎన్నోరోజులుగా వెలగని వీధి దీపాలను పట్టించుకోవడం లేదని, పురుగు, పుట్ర, విష కీటకాలు వస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

తాగునీటికి కటకట...

గ్రామంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. పల్లపు ప్రాంతాల్లోని కుటుంబాలకు సరిపడా నీరు అందుతుండగా... గడ్డపైన ఉన్న పలు కుటుంబాలకు నీళ్ల సరిపడా అందడం లేదు. మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం కోసం రెండు నెలల క్రితం కాలువ తవ్వి వదిలేశారు. ఆ పనులు అసంపూర్తిగా మిగలడంతో గ్రామస్తులకు నీరందడం లేదు. దీంతో వ్యవసాయ బోర్లపైనే ఆధారపడుతున్నారు. ఎన్నో రోజులుగా ఇక్కడ చేతిపంపు మరమ్మతులకు గురైనా ఆ చేతిపంపును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో గ్రామస్తులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. కందకం కోసం తవ్విన మట్టి రోడ్డు మీదే పోయడంతో గ్రామస్తులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం..

గ్రామంలో ఎక్కడ చూసినా అపరిశుభ్రమే దర్శనమిస్తోంది. సైడు కాలువలు ఉన్నప్పటికీ నిర్వహణ లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. పారిశుద్ధ్యం లోపించడంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు.

కాలువల్లో చెత్తా చెదారం పేరుకుపోవడంతో పాములు, తేళ్లు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్లీచింగ్ కూడా చల్లడం లేదని, రాత్రి సమయాల్లో దోమలతో అవస్థలు పడుతున్నామని ఆరోపిస్తున్నారు.



మరమ్మతులకు గురైన చేతిపంపును చూపుతున్న గ్రామస్తులు

ఏళ్లుగా మట్టి రోడ్డే గతి...

ఎస్సీ కాలనీలో ఏళ్ల తరబడి మట్టి రోడ్డే. సుమారు 500 మీటర్ల దూరం గల ఈ వీధిలో రోడ్డు నిర్మాణానికి ఏడేళ్ల క్రితం నిధులు మంజూరైనట్లుగా తెలుస్తోంది. ఆ నిధులతో రోడ్డు వేయకపోవడంతో ఇది అలానే మిగిలిపోయింది. ప్రస్తుతం అయినా రోడ్డు నిర్మాణం చేపట్టాలని వీధిలోని పలు కుటుంబాలు కోరుతున్నా రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదు.

నీళ్లు సక్రమంగా రావడం లేదు..



మిషన్ భగీరథ నీళ్లు సక్రమం రావడం లేదు. బోరు నీరు తాగేందుకు వీలు లేకుండా తుప్పునీట్లు వస్తున్నాయి. దీంతో వ్యవసాయ బోర్లపైనే ఆధారపడుతున్నాం. బిందెడు నీళ్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.

– చిలకా రమ, సింగభూపాలెం

పైపులైన్ తవ్వి రెండు నెలలు అయింది..



మిషన్ భగీరథ పైపులైన్ కోసం కాల్వ తవ్వి రెండు నెలలు అయింది. రోడ్డుపై మట్టితో ఇబ్బందులు పడుతున్నాం. కాల్వల్లో చిన్న పిల్లలు పడి గాయాల పాలవుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో విష జంతువులు వస్తున్నాయి.

– పొదిల రాములు, సింగభూపాలెం

సమస్యలు పరిష్కరిస్తా...



గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాను. మిషన్ భగీరథ పైపులైన్ నిర్మాణం గురించి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైన త్వరగా పూర్తి చేయిస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని పనులు చేయిస్తాం.

– టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్

క్లుప్తంగా

రన్స్ అండ్ గోల్స్ స్టేడియం పరిశీలన



స్టేడియాన్ని పరిశీలిస్తున్న జీఎం

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంను ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదివారం అధికారులతో కలిసి సందర్శించారు. వాకింగ్ ట్రాక్, క్రికెట్ పిచ్, గ్రౌండ్ లైటింగ్‌ను పరిశీలించారు. వాటి మరమ్మత్తులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. అదేవిధంగా క్రికెట్ ప్రాక్టీస్ కోసం ఒక నెట్టును ఏర్పాటు చేయాలని క్రీడాకారులు కోరగా సానుకూలంగా స్పందించారు.

టీఆర్‌వీకేఎస్‌లో చేరిక

పాల్వంచ: టీఆర్‌వీకేఎస్ యూనియన్‌లో పలువురు చేరారు. ఆదివారం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేశ్ సమక్షంలో కేటీపీఎస్ 7వ దశకు చెందిన జి.రాఘవ, ఆడెపు కావ్యలతో పాటు పలువురు యూనియన్లలో చేరడంతో కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం రమేశ్ మాట్లాడుతూ... ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారమే యూనియన్ లక్ష్యం అన్నారు. తోట కోటేశ్వర రావు, ముత్యాల రాంబాబు, కోటిలింగం, ఆర్.శ్రీనివాస్, సాధిక్ పాషా, వెంకటరమణ, అమీన్, మల్సూర్, శేషం రాజు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన జెన్కో క్రీడాకారులు

పాల్వంచ: ఈనెల 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం పంచుకుల స్పోర్ట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరగనున్న హాకీ, టగ్ ఆఫ్ వార్ ఆల్ ఇండియా క్రీడలకు తెలంగాణా జెన్కో క్రీడాకారులు ఇటీవల ఎంపికయ్యారు. కెప్టెన్ ధర్మారాజుల శ్రీను ఆధ్వర్యంలో క్రీడాకారులు బోయిన శ్రీను, వై.వెంకటేశ్వర్లు, వల్ల ప్రకాశ్, కచ్చా రమేశ్, వాసురెడ్డి తదితరులు సోమవారం హర్యానా వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం కేటీపీఎస్ 5,6 దశల క్రీడా కార్యదర్శి తంబళ్ల వీరస్వామి క్రీడాకారులను అభినందించారు.

అమ్మకు సాయం...



తల్లితో కలిసి ఎరువు వేస్తున్న చిన్నారులు

కన్నతల్లికి సాయంగా తనయులు కూడా అదే పనిచేస్తూ పనిభారం తగ్గిస్తున్నారు. సుజాతనగర్ మండలంలోని మర్రితండా గ్రామ సమీపంలోని పత్తిచేలో ఓ మహిళ పత్తిపంటకు కాంప్లెక్స్ ఎరువు వేస్తుండగా ఎనిమిది, ఆరు సంవత్సరాల తన కుమారులు కూడా అమ్మని అనుసరిస్తూ ఉడతాభక్తిగా అదే పనిలో నిమగ్నమయ్యారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో అమ్మకు సాయంగా వచ్చినట్లు చిన్నారులు తెలిపారు. ఈ చిత్రాన్ని 'సాక్షి'తన కెమెరాలో బంధించింది.

– సుజాతనగర్

కొత్తగూడెంలో బీసీ గర్జన



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొత్తగూడెంఅర్బన్: బీసీ హక్కుల సాధనకై అలుపెరుగని ఉద్యమాలు చేస్తున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్యకు తామంతా మద్దతు ఇస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం లేపాక్షి హోటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను ఐక్యం చేసేందుకు, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 10న కొత్తగూడెం క్లబ్‌లో బీసీ గర్జనను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీల హక్కుల కోసం ఎళ్ల తరబడి ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ఎన్నికల్లో హామీలు ఇస్తూ గద్దెనెక్కిన పార్టీలు మొండి చెయ్యి చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ గర్జనకు జిల్లాలోని బీసీలంతా హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి బండి రాజుగౌడ్, రాష్ట్ర, జిల్లా నాయకులు తూముల శ్రీనివాస్, భూపతి శ్రీనివాసరావు, కురిమిళ్ల శంకర్, గుమాలపురం సత్యనారాయణ, కృష్ణ, కసోజు రామాచారి, ఇంద్రాల దుర్గయ్య, రామగిరి రాజేందర్, కాసోజు రాజేశ్వరి, మునీల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేస్తా..



నర్సయ్యను సన్మానిస్తున్న తోటి ఉద్యమకారులు

కొత్తగూడెంటౌన్: వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని తొలి, మలి తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య అన్నారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన ఉద్యమకారుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్సయ్యను తోటి ఉద్యమకారులు ఘనంగా సన్మానించారు. నర్సయ్య మాట్లాడుతూ.. కొత్తగూడెం ఎమ్మెల్యే నేనంటే నేనని.. కొట్లాడుకోవడంతోనే సరిపోతుంది.. మరి ప్రజా సమస్యలు ఎవరు పట్టించుకుంటారని ప్రశ్నించారు. అందుకే కొత్తగూడెం ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నట్లు తెలిపారు. కార్మికుడిగా ఉన్న నాకు అందరి సమస్యలు తెలుసన్నారు. తెలంగాణ ఉద్యమంలో 1969 నుంచి 2014 వరకు తెలంగాణ పోరాటంలో ముందుండి పోరాటం చేసిన చరిత్ర ఉద్యమకారులదని, ఎందరో ప్రాణత్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ రావడానికి కారణమైన ఉద్యమకారులను తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఉద్యమకారులకు, ఇటు ప్రజలకు న్యాయం జరగలేదని ఉద్యమకారులే ప్రజాక్షేత్రంలో పోరాటం చేసి విజయం సాధిస్తారన్నారు. ఉద్యమకారులు ప్రజా ప్రతినిధులు అయితేనే ప్రజలతో పాటు ఉద్యమకారులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.వలీబాబా, కూచనకృష్ణారావు, టి.రామారావు, సఫ్దార్‌బేగ్, కాకెల్లి సైమన్, ఎడ్ల ఎలియా, రామ్మూర్తి, ఏలూరి రాములు, సలీం, శ్రీపాద సత్యనారాయణ, లక్ష్మీనారాయణలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర్లు అన్ని రంగాల్లో వృద్ధి చెందాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

చుంచుపల్లి: వడ్డెర్లు అన్ని రంగాల్లో ఎదగాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణరాజు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విద్యానగర్‌లో సమావేశం నిర్వహించారు. ముందుగా సత్యనారాయణరాజు జెండా ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం ముందు నుంచీ ఉన్న సీటీ యాక్ట్ (క్రిమినల్ ట్రైబ్స్)ను 1952లో తొలగించి డీఎన్‌టీ (డీనోటిఫైల్ ట్రైబ్స్) గుర్తింపు లేని తెగలుగా పరిగణించడం జరిగిందన్నారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ శాఖచే లేబర్ కార్డు చేయించేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పల్లపు వెంకటేశ్వర్లు, రాయల చందర్ రావు, దుర్గారావు, కనకరాజు, గోగుల వెంకటేశ్వర్లు, ముత్యాలరావు, పుల్లయ్య, కుమార స్వామి, వీరస్వామి పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు నిర్వహించండి

పాల్వంచరూరల్: వానాకాలం సీజన్‌లో దోమల కారణంగా మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడక ముందే ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందిని గ్రామాలకు పంపి జ్వరాల బారిన పడిన వారి రక్తనమూనాలను సేకరించి వ్యాధిని గుర్తించి వైద్యచికిత్సలు అందించాలని కోరారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు, ఆరోగ్య సూచనలు ఇవ్వాలని కోరారు. ఇటీవల వర్షాలకు ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం లోపించినట్లు చెప్పారు. ప్రతి ఇంటికి దోమలతెరలను పంపిణీ చేయాలని పేర్కొన్నారు.

బోనమెత్తిన పల్లెలు

శ్రావణమాసం పురస్కరించుకొని పల్లెలన్నీ గ్రామదేవతలను కొలుస్తూ బోనమెత్తాయి. పల్లెవాసులు గ్రామదేవతైన ముత్యాలమ్మ, మైసమ్మ, బొడ్రాయిలకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రతి ఇంటి నుంచి బోనం తెచ్చిన భక్తులు పసుపు, కుంకుమ, పూలు, గాజులతో ప్రత్యేక పూజలు చేశారు. పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. పూజా కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు స్థానికులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాల్వంచ: అమ్మవారి పల్లకీ మోస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



ఇల్లెందురూరల్: జగదాంబగుంపు ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల సందడి



టేకులపల్లి: హనుమాతండాలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఒడిశా వెళ్లిన సింగరేణి ఉద్యోగులు



ఒడిశాలో కొత్తగూడెం సింగరేణి ఏరియా ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): ఒడిశా రాష్ట్రంలోని పూరీ పట్టణంలో ఈనెల 21 నుంచి 26 వరకు జరగనున్న పరిశ్రమల్లో శాంతి నెలకొల్పేందుకు యూనియన్ల పాత్ర అనే అంశంపై అవగాహన కార్యక్రమానికి సింగరేణిలోని వివిధ ఏరియాల్లో 10 మంది ఉద్యోగులు శనివారం బయలుదేరి ఆదివారం ఒడిశా చేరుకున్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు ఓదేలు మాట్లాడుతూ.. ఈ రెసిడెన్షియల్ కార్యక్రమానికి సింగరేణి సంస్థ తమ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్‌పై నమ్మకంతో పంపించిన డైరెక్టర్(పా) ఎన్.బలరామ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చర్చించే అంశాలను కంపెనీ అభివృద్ధికి ఉన్నతాధికారులకు వివరిస్తానన్నారు. కార్యక్రమానికి సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల ఉద్యోగులకు ప్రాతినిధ్యం కల్పించటం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో ఆరెపల్లి రాంచందర్, గోడ రమేష్, దామెర ప్రవీణ్‌కుమార్, బడికెల కృష్ణ, పీక శంకర్రావ్, బూర్గుల వెంకట రత్నం, నెలబోయినకుమార్, చెవెల్లి మురళీ, మేకల శంకర్రావ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం సాధించుకుందాం..



పార్టీలో చేరినవారితో కామేష్ తదితరులు

కొత్తగూడెంఅర్బన్: రాజ్యాధికార సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయం ఆవరణలో బహుజన యువజన గర్జన కార్యక్రమం నిర్వహించారు. వినయ్ నేతృత్వంలో సుమారు 500 మంది యువకులు, కార్యకర్తలు వివిధ పార్టీల నుంచి బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా కామేష్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. పలువురు బీఎస్పీలో చేరుతున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో తమ పార్టీ గెలుస్తుందని దీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులను ఓటమి భయం వెంటాడుతోందన్నారు. దళితులు, గిరిజనులు, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు లేకుండా ఏ పార్టీ మనుగడ సాగించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, బండి రమణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి అధ్యక్షుడిగా వీరస్వామి



నియామకపత్రం అందుకుంటున్న వీరస్వామి

జూలూరుపాడు: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా బడుగు వీరస్వామి నియమితులయ్యారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్ చేతులు మీదుగా హైదరాబాద్‌లో నియామకపత్రాన్ని అందుకున్నట్లు వీరస్వామి ఆదివారం విలేకరులకు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోహన్, జిల్లా అధ్యక్షుడు గిద్దా కొండయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ వినియోగించుకోండి

ఇల్లెందు: సింగరేణి ఏరియాలో పని చేస్తున్న ఎన్‌సీడబ్ల్యూ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరానికిగాను పేరొందిన ఐఐటీ, ఐఐఎంలలో సీట్లు సాధించిన సింగరేణి పిల్లలకు ట్యూషన్ ఫీజును సింగరేణి సంస్థ రీయింబర్స్‌మెంట్ చేయాలని నిర్ణయించిందని ఏరియా జీఎం జాన్‌ఆనంద్ ఆదివారం వెల్లడించారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రతిభ అవార్డులు



అవార్డులు అందుకున్న విద్యార్థులు

పాల్వంచ: పాల్వంచలోని కొత్తగూడెం గురుకుల మైనార్టీ బాలికల కళాశాల విద్యార్థులు మాస్టర్ మైండ్ ప్రతిభా అవార్డులు అందుకున్నారు. ఆదివారం కొత్తగూడెంలోని ఎస్ఆర్ హనుమత్ సేవా సదన్‌లో జరిగిన కార్యక్రమంలో 2023 ఎంపీసీ, బైపీసీలో అత్యధిక మార్కులు సాధించిన ఎండీ.హీనా కౌసర, ఎస్‌డీ.నిహారస్, ఎస్.జయశ్రీ, ఎస్‌కే.ఫరహా, వి.కావ్యశ్రీ అవార్డు, రివార్డు, సర్టిఫికెట్లు అందుకున్నారు. వీరిని అకడమిక్ కోఆర్డినేటర్ అఫ్రోజ్, ప్రిన్సిపాల్ బిపాసా, అధ్యాపకులు అభినందించారు.

దరఖాస్తుల విచారణ

ఇల్లెందురూరల్: తిలక్‌నగర్ గ్రామపంచాయతీలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులపై పంచాయతీ అధికారులు ఆదివారం ఇంటింటి విచారణ చేపట్టారు. గ్రామంలో కొంతమంది ప్రజలకు ప్రభుత్వం ఇంటిస్థలాలు మంజూరు చేసి డెవలప్‌మెంట్ కాలనీగా నామకరణం చేసింది. కాలనీలో ఇంటిస్థలాలు మంజూరైన ప్రజలకు సంబంధించిన దరఖాస్తులను గ్రామస్తుల సమక్షంలో వారికి కేటాయించిన ఇంటిస్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనసరి స్రవంతి, కార్యదర్శి తిరుపతరావు, స్థానికులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. వక్తలు మాట్లాడుతూ.. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు రాజీవ్ ఎనలేని కృషి చేశారని, అతిపిన్న వయస్సులోనే ప్రధాని పీఠం ఎక్కిన మేధావి అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందు: రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కనకయ్య



కొత్తగూడెంరూరల్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొత్తగూడెంరూరల్: రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



జూలూరుపాడులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇల్లెందురూరల్: రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



టేకులపల్లి సెంటర్‌లో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు



జూలూరుపాడు: రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు నిర్మాణం ఎప్పుడో..?



సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లి నుంచి మర్రితండా గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. ఐటీడీఏ పరిధిలో గతంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా.. ఆ సమయంలో గ్రావెల్ పనులు మాత్రమే చేశారు. మిగిలిన పనులు పూర్తికాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ప్రస్తుతం సుజాతనగర్, సీతంపేట గ్రామాల మధ్య వంతెన నిర్మాణ పనులు జరుగుతుండడంతో ఈ రహదారిలో రద్దీ పెరిగింది. రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. – సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్
ఫోన్ నెంబర్: 63030 23384